ప్రజాపక్షం
PRAJAPAKSHAM
స్తంభాద్రి భద్రాద్రి
సోమవారం | 01 | జూలై | 2024
పేజీలు 6

## అతుల్ కుమార్ అంజన్‌కు సిపిఐ నివాళి




2లో

# బిజెపి విధానాలు ప్రమాదకరం




**-లౌకిక వాదానికి మోడీ తూట్లు**
**-కాంగ్రెస్ సంక్షేమ కార్యక్రమాల వేగం పెంచాలి**
**-సిపిఐ కౌన్సిల్ సమావేశంలో జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** బిజెపి విధానాలు దేశానికి ప్రమాదకరమని కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని సిపిఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా ఆరోపించారు. అతి కొద్ది కార్పొరేట్ల కోసమే బిజెపి తన విధానాలను అమలు చేస్తుందని దేశ సంపదను దోచిపెట్టడమే గాక ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటీకరించే పనిలో దుస్సహాసానికి పాల్పడుతుందని ఆయన తెలిపారు. సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిజెపికి వ్యతిరేకత మొదలైందని కాని ఓడించే స్థితికి చేరుకో లేదని బలమైన ప్రతిపక్షంతో బిజెపి తన విధానాలను మార్చుకోక తప్పని స్థితి అని ఆయన తెలిపారు. మతోన్మాద చర్యల నుంచి తిరోగమన బాట పట్టక తప్పదని ఇప్పటికైనా రాజ్యాంగాన్ని గౌరవిస్తూ లౌకిక వాదాన్ని కాపాడాలన్నారు. బిజెపి వ్యతిరేక ప్రచారంలో కమ్యూనిస్టులు ముందు వరుసలో నిలిచారని దేశ వ్యాప్తంగా కమ్యూనిస్టులకు బలమైన కేంద్రాల్లో మోడీ, ఎన్‌డిఏకు గట్టి ఎదురు దెబ్బ తగిలిందన్నారు. కాంగ్రెస్ మరింత విశాల ధృక్పథంతో మిత్ర పక్షాలను కలుపుకునిపోయి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదని పాషా

మిగతా 2లో..

## ప్రత్యామ్నాయ శక్తిగా
# ఎదిగేందుకు కృషి




**-బిఆర్ఎస్ బలహీనత బిజెపికి బలమైంది**
**-నిరంతరంగా రాజకీయ సైద్ధాంతిక శిక్షణ**
**-బొగ్గు బ్లాకుల వేలంపై ఐదు నుంచి ఆందోళనలు**
**-మీడియా సమావేశంలో కూనంనేని**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** తెలంగాణలో రాజకీయ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగేందుకు సిపిఐ ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగుతుందని అందుకు తగిన కార్యాచరణ రూపొందించనున్నామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. తెలంగాణ ప్రజల్లో కమ్యూనిస్టు పార్టీ అంతర్భాగంగా ఉందని చైతన్య వంతమైన ఈ రాష్ట్రంలో బిజెపికి అవకాశం

మిగతా 2లో..

## సంపద సృష్టించి ప్రజలకు పంచుతాం



**-మహిళలను మహారాణులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం**
**-ఖమ్మంజిల్లా పర్యటనలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**
**-మధిర నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయేలా గత ప్రభుత్వం పని చేసిందని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సంపదను సృష్టించి ప్రజలకు పంచడమే లక్ష్యంగా పని చేస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రభుత్వ చేయూతతో మహిళలు మహారాణులు కానున్నారని ఆయన తెలిపారు. ఆదివారం ఖమ్మంజిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మల్లు భట్టివిక్రమార్క పాల్గొన్నారు. ఖమ్మంలో ఓ ప్రైవేటు ఆసుపత్రిని ప్రారంభించిన ఆయన చింతకాని, బోనకల్, మధిర మండలాల్లో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన గ్యారెంటీలను

మిగతా 2లో..

## ప్రశ్నార్థకంగా సన్నాల సాగు..!



**- రూ.500 బోనస్‌పై స్పష్టత ఏది..?**
**- ఏఏ రకాలకు బోనస్ వర్తిస్తుందో తేల్చని ప్రభుత్వం**
**- అయోమయంలో అన్నదాతలు**
**- దొడ్డు రకాలవైపే మొగ్గు**
**- సన్న రకాలతో తక్కువ దిగుబడి**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** రాష్ట్ర వ్యాప్తంగా రైతులు సన్నాలనే సాగు చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం తేల్చిచెప్పింది. సన్నని వరి రకాలను సాగు చేసే రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని కూడా ప్రకటించారు. దీంతో ఈ వానా కాలం సీజన్లో సన్నాల సాగు అమాంతంగా పెరుగుతుందని అంతా ఆశించారు. వాస్తవానికి ప్రతీ ఏటా 20 నుండి 30 శాతం వరకు మాత్రమే ఇంటి అవసరాల నిమిత్తం సన్నరకాలను సాగుచేసేవారు. మిగతాదంతా దొడ్డు రకం వరి వంగడాలు వేసేవారు. కాగా ఈ సారి ప్రభుత్వం ప్రకటనతో 60 నుండి 70 శాతం సన్న రకాలు పండించే అవకాశం కనిపిస్తోంది. కాగా ఏఏ రకాలు వేయాలో త్వరలో ప్రకటిస్తామని చెప్పిన ప్రభుత్వం వానా కాలం మొదైలనప్పటికీ బోనస్ ఇచ్చే సన్నరకాలను నేటికీ ప్రకటించలేదు.

మిగతా 2లో..

# బిజెపి విధానాలు ప్రమాదకరం

**(మొదటిపేజీ తరువాయి)**

తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ఎన్నో ఆశలు ఉన్నాయని ఆ ఆశలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమం అమలులో వేగాన్ని పెంచాలని అజీజ్ పాషా సూచించారు. ముఖ్యంగా కాంగ్రెస్ ఇచ్చిన ఆరు హామీలను ప్రజలు విశ్వసించారని ప్రజల విశ్వాసాన్ని వమ్ము చేయకుండా హామీల అమలుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు. ముఖ్యంగా మహిళలకు నెలకు రూ.2,500 నగదు బదిలీ, ఆర్థిక చేయూత, డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాల విషయంలో త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. రుణమాఫీ, రైతు భరోసా, పింఛన్ల విషయంలో ఇచ్చిన నిర్ణయానికి కట్టుబడి ఉండాలని ఆయన కోరారు. కాంగ్రెస్ రాజకీయ నిర్ణయాలు సైతం బిఆర్ఎస్‌తో కొన్ని సరి పోలుతున్నాయని పాషా తెలిపారు. ప్రజాస్వామ్యంలో వ్యక్తులు, ప్రజా ప్రతినిధుల కంటే ప్రజలు విపక్షంగా మారకుండా చూసుకున్నప్పుడే అధికార మనుగడ కొనసాగుతుందని పాషా తెలిపారు. రాష్ట్రంలో, దేశంలో కమ్యూనిస్టు శక్తులు పురోగమిస్తున్నాయని ఆయన తెలిపారు. సంఖ్యా బలం కంటే ప్రజల ఆలోచనల్లో కమ్యూనిస్టు సానుకూల ధృక్పథం పెరుగుతుందని కమ్యూనిస్టుల అవసరాన్ని ప్రజలు గుర్తిస్తున్నారన్నారు. కొందరు కుహానా మేధావులను పక్కన పెడితే మేధావి వర్గం సైతం కమ్యూనిస్టుల అవసరాన్ని గుర్తించి ప్రజలకు మేలు జరగాలంటే కమ్యూనిస్టులు ఉండాలన్న ప్రచారాన్ని ముందుకు తేవడం అత్యంత సానుకూల పరిణామమని పాషా తెలిపారు. ప్రజల మనోభావాలకు అనుగుణంగా కమ్యూనిస్టు పార్టీని విస్తరించేందుకు సమిష్టి కృషి జరగాలన్నారు. ప్రజా సమస్యలను గుర్తించి ఆందోళనలకు కార్యకర్తలను సమాయత్తం చేయాలని అజీజ్ పాషా పిలుపునిచ్చారు. పాలకులు ఎవరైనా ప్రజలే ముఖ్యమని, ప్రజా సమస్యల పరిష్కారమే కమ్యూనిస్టుల ఎజెండా కావాలని ఆయన సూచించారు. పోటు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె. సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, సిపిఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగేందుకు కృషి

**(మొదటిపేజీ తరువాయి)**

దక్కదన్నారు. నిర్మాణం లేకుండా సెంటిమెంట్ పై ఆధారపడిన బిఆర్ఎస్ అధికారంలో లేకుండా బతకడం కష్టమని సాంబశివరావు తెలిపారు. కాంగ్రెస్ లేదా ఇతర రాజకీయ పక్షాలకు ప్రత్యామ్నాయంగా ఎదిగేందుకు సిపిఐకి అవకాశాలు ఉన్నాయని ఆయన తెలిపారు. సిపిఐ రాష్ట్ర సమితి సమావేశ నిర్ణయాలను ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి 10 జిల్లాల్లోను కమ్యూనిస్టు పార్టీకి నిర్మాణం ఉందని దానిని మరింత విస్తృత పరిస్తే ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగేందుకు అవకాశం ఉందన్నారు. బలమైన ప్రాంతాలను పార్టీ విస్తృతికి అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. పొత్తులు అనివార్యమవుతున్నాయని కాని ఇదే సమయంలో ఇతరులపై ఆధారపడే అవకాశం రాకుండా భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తున్నామని కూనంనేని తెలిపారు. తెలంగాణలో పార్లమెంటు ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే కమ్యూనిస్టులు బలంగా ఉన్నచోట కాంగ్రెస్ భారీ మెజార్టీతో విజయం సాధించిందని కమ్యూనిస్టులు బలహీనంగా ఉన్నచోట బిజెపి గెలిచిందన్నారు. కాంగ్రెస్ సైతం ఈ వాస్తవాన్ని గుర్తించాలని పలుకుబడి కలిగి ప్రజల్లో సానుకూల భావనతో ఉన్న కమ్యూనిస్టులను గుర్తించాలని డిఎంకె మాదిరి మిత్ర పక్షాలకు కూడా సరైన అవకాశాలు కల్పించాలని కూనంనేని సూచించారు.

**కమ్యూనిస్టుల కార్యక్రమాల వల్లనే...**

కమ్యూనిస్టుల కార్యాచరణ, బిజెపి వ్యతిరేక ప్రచారం నిర్వహించడం వల్లనే పార్లమెంటు ఎన్నికల్లో బిజెపి బలం గణనీయంగా తగ్గిందని సాంబశివరావు తెలిపారు. బిజెపి మతోన్మాద ప్రచారాన్ని తిప్పికొడుతూ దేశ వ్యాప్తంగా ప్రజల్లో రాజకీయ చైతన్యం కలిగించడం జరిగిందని సాంబశివరావు తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి అంశాల వారీగా మద్దతునిస్తూనే ప్రజా సమస్యలు ముఖ్యంగా సంఘటిత, అసంఘటిత కార్మిక వర్గం, రైతులు, కూలీలు, మధ్య తరగతి ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడతామన్నారు. తెలంగాణలో కాంగ్రెస్, బిజెపియేతర రాజకీయ శూన్యతను భర్తీ చేసేందుకు సిపిఐ సిద్ధమవుతుందన్నారు. ఇందు కొరకు ఒక పక్క ఆందోళనలు మరో పక్క సైద్ధాంతిక శిక్షణ ప్రచారాలను ముమ్మరం చేస్తామని ఆయన తెలిపారు.

**బిజెపి, బిఆర్ఎస్ దొందు దొందే...**

బొగ్గు బ్లాకుల విషయంలో బిజెపి, బిఆర్ఎస్ ది ఒక్కటే వైఖరి అని బిజెపి, ఎంఎండిఆర్ చట్టాన్ని తీసుకు వస్తుంటే బిఆర్ఎస్ మద్దతునిచ్చిందని సాంబశివరావు తెలిపారు. బొగ్గు బ్లాకుల వేలం రాష్ట్రంలో బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే మొదలైందని కోయగూడెం అరవిందో కంపెనీకి మరో చోట అవంతి కంపెనీకి కట్టబెట్టి ఇప్పుడు బిఆర్ఎస్ నేతలు మొసలి కన్నీళ్లు కారుస్తున్నారని ఆయన తెలిపారు. బొగ్గు బావుల విషయంలో బిజెపి కి చెందిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అబద్దాలు చెప్పడంలో మోడీనే మించి పోయారన్నారు. ఇతర రాష్ట్రాల్లో స్థానిక ప్రభుత్వాలకు బొగ్గు ఉత్పత్తిని అప్పగించినప్పుడు తెలంగాణలో ఎందుకు ఇవ్వరని ఆయన ప్రశ్నించారు. చట్ట విరుద్ధమైన బొగ్గు బ్లాకుల వేలాన్ని అడ్డుకుంటామన్నారు. వేలాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా జూలై ఐదు నుంచి ఆందోళనలు చేస్తామని సాంబశివరావు తెలిపారు. జూలై ఐదున కలెక్టరేట్లను దిగ్బంధిస్తామని సింగరేణి ప్రభావిత ప్రాంతాలలో ఆందోళనలు చేస్తామని బొగ్గు బ్లాకుల వేలాన్ని ఉపసంహరించుకునేంత వరకు తమ ఆందోళన కొనసాగుతుందని సాంబశివరావు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు ఒకటిన కలెక్టరేట్లను ముట్టడించాలని సిపిఐ నిర్ణయించిందన్నారు. సమావేశంలో తీసుకున్న కార్యాచరణను అమలు చేస్తూ హన్మకొండలో పార్టీ నిర్మాణ కౌన్సిల్‌ను నిర్వహించాలని నిర్ణయించడం జరిగిందని సాంబశివరావు తెలిపారు. మీడియా సమావేశంలో జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట రెడ్డి, కార్యవర్గ సభ్యులు బాగం హేమంతరావు, పర్స పద్మ, తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, బాల మల్లేష్, బాల నర్సింహా, కె. శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# అతుల్ కుమార్ అంజన్‌కు సిపిఐ నివాళి

**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు అతుల్ కుమార్ అంజన్ కు సిపిఐ రాష్ట్ర సమితి సమావేశాల సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. అతుల్ కుమార్ అంజన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యునిగా అఖిల భారత రైతు సంఘం జాతీయ అధ్యక్షునిగా పని చేసిన అంజన్‌కుమార్ ఇటీవల మరణించిన విషయం విధితమే. ఈ సందర్భంగా సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ విద్యార్థి, యువజన ఉద్యమాల నుంచి అతుల్ కుమార్ అంజన్ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తూ వచ్చారన్నారు. అంజన్‌కుమార్ నిబద్ధత గల కమ్యూనిస్టు అని రైతాంగ సమస్యలపై అవగాహన కలిగిన అంజన్ రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా కృషి చేశారని ఆయన సేవలు మరువ లేనివని, మరపురానివని నారాయణ తెలిపారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా, కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, రాష్ట్రకార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సిపిఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పర్స పద్మ, బాగం హేమంతరావు, సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సంపద సృష్టించి ప్రజలకు పంచుతాం

**(మొదటిపేజీ తరువాయి)**

ప్రభుత్వం తప్పక అమలు చేస్తుందన్నారు. రాష్ట్ర సంపద రాష్ట్ర ప్రజలకే చెందేలా తమ ప్రభుత్వం హామీలను నెరవేరుస్తుందని దశాబ్ద కాలంలో అప్పుల పాలైన తెలంగాణను ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కిస్తున్నామని ఆయన తెలిపారు. ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వంలో మహిళలను మహారాణులుగా తీర్చిదిద్దే క్రమంలో అనేక కార్యక్రమాలను చేపట్టామన్నారు. మహిళలకు ఉచిత ఆర్టిసి బస్సు సౌకర్యం కల్పించడంతో పాటు ఆర్థికంగా ఎదిగేందుకు క్యాంటీన్ల నిర్వహణ బాధ్యతను అప్పగించామన్నారు. తెలంగాణలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేయబోతున్న మీ సేవా కేంద్రాలను కూడా మహిళలకే అప్పగిస్తామని ఆర్థిక స్వాలంభన కోసం మహిళా స్వయం సేవక సంఘాలను ఆర్థికంగా ప్రోత్సహిస్తామన్నారు. ఉదయం 11 గంటలకు ఖమ్మంలో స్తంభాద్రి ఆసుపత్రి ప్రారంభ కార్యక్రమంలో భట్టివిక్రమార్క చింతకాని మండలం గాంధీనగర్ చేరుకుని రూ. 175 లక్షలతో నిర్మించే గాంధీనగరం, బొప్పారం రోడ్లకు శంకుస్థాపన చేశారు. మధిర మండలం వంగవీడు గ్రామానికి చేరుకుని రూ. 30 కోట్లతో బోనకల్, ఆళ్లపాడు, వంగవీడు గ్రామాల వరకు బిటి రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేసిన ఆయన చిలుకూరు గ్రామంలో రూ. 70 లక్షల బిటి రోడ్డు నిర్మాణ పనులకు రూ.2.85 కోట్లతో నిర్మించే చిలుకూరు, దొడ్డదేవరపాడు బిటి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మధిర మండలం మర్లపాడు గ్రామానికి చేరుకుని రూ. 2.75 కోట్లతో నిర్మించే మర్లపాడు, పెనుగొండ ను, సిద్దినేని గూడెం రోడ్డుకు శంకుస్థాపన చేశారు. మాటూరులో రూ. 5 కోట్ల ఖర్చుతో నిర్మించే బిటి రోడ్లకు శంకుస్థాపన చేశారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన భట్టి విక్రమార్కకు అడుగడుగున ఘన స్వాగతం లభించింది.

# సిపిఐ ఎంఎల్ ఆధ్వర్యంలో ధర్నా

**ప్రజాపక్షం/భద్రాచలం :** పోడుభూముల సమస్యల పరిష్కారం కోరుతూ సిపిఐ ఎంఎల్ ఆధ్వర్యంలో నేడు ధర్నా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకులు కెచ్చల రంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక బ్రిడ్జీ సెంటర్ నుండి ర్యాలీగా ఐటిడిఏకు చేరుకుని గేటు ముందు ధర్నా నిర్వహిస్తామని, అనంతరం అధికారులకు వినతి పత్రాన్ని అందజేస్తామని చెప్పారు, గత పాలకులు పోడుభూములకు పట్టాలు ఇస్తామని చెప్పి కొన్నింటికి ఆపారని 2006 అటవీ హక్కుల చట్టం కంటే ముందు పోడు కొట్టిన వాటికి ఇస్తామని చెప్పారని, కానీ అటవి అధికారులు తప్పుడు నివేదికలు చూపిస్తూ అర్హులకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోడు సమస్య పరిష్కారం కోసం ఐటిడిఏ ముందు జరిగే ధర్నాను జయప్రథ ం చేయాలని ఆయన కోరారు.

# ప్రశ్నార్థకంగా సన్నాల సాగు..!

**అయోమయంలో అన్నదాతలు...**

ఏఏ సన్నరకాలకు బోనస్ ఇస్తారో ఇంకా ప్రభుత్వం ప్రకటించక పోవడంతో రైతులు అయోమయంలో పడ్డారు. కొన్ని ప్రాంతాల్లో ఇప్పుడిప్పుడో నార్లు పోస్తున్నారు. ఆ నారు చేతికందే సమయానికి అదునుదాటుతుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో చీడ పిడలు ఎక్కువ మొత్తంలో ఆశించే ప్రమాదం ఉందని రైతులు అంటున్నారు. తద్వార క్రిమి సంహారక మందులు వాడకం పెరిగి ఖర్చు తడిసి మోపెడయ్యే అవకాశం ఉంది. దీనిని బట్టి చూస్తే ప్రస్తుతం బోనస్ ఇచ్చే రకాలను ప్రకటించినా ఈ సీజన్‌లో సాగుబడి తగ్గే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. దీంతో నార్లు పోసుకునే పరిస్థితి లేకుండా పోయింది. కానీ జిల్లాలో అక్కడక్కడా సన్న రకాల నార్లు పోసుకున్న రైతులు ఆ రానికి బోనస్ వచ్చిన రాకున్నా ఇంటి అవసరాలకు వాడుకోవచ్చులే అని ధీమాతో ఉన్నారు.

**ఈ సారికి ఇంతే ...**

ప్రభుత్వం నాటాల్సిన సన్న రకాలను ప్రకటించక పోవడంతో రైతులు మళ్లీ దొడ్డు రకాలవైపు మొగ్గు చూపుతున్నారు. వాస్తవానికి ఈ వానా కాలం సీజనల్లో జిల్లా వ్యాప్తంగా 1,65,854 ఎకరాల్లో వరి సాగు చేస్తారనే అంచనాలను వ్యవసాయాధికారులు తయారు చేశారు. ప్రభుత్వం రకాలను ప్రకటించి ఉంటే ఇందులో సుమారు 1 లక్ష ఎకరాల వరకు సన్నాలు సాగయ్యే అవకాసం ఉండేది. కానీ ఈ సారికి ఇంతే అనే చందంగా ఇంటి అవసరాలకు మినహాఇంచి సన్నరాలను నాటు వేసేందుకు రైతులు సిద్ధ పడుతున్నారు. రేషన్ షాపుల్లో సైతం సన్నరకాలనే సరఫరా చేస్తామని ప్రకటించినప్పటించింది. దీనిని బట్టి చూస్తే పౌరసరఫరాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 25 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం ఉంటుంది.కానీ సాగు పెరిగే అవకాశం కానరావడం లేదు. మరో ప్రక్క కొన్ని కంపెనీలు ఒప్పందం ప్రకారం దొడ్డు రకాలను సాగు చేసేందుకు రైతులను ప్రోత్సహిస్తూ పెట్టుబడులు సైతం పెడుతోంది. దీంతో రైతులు ఇప్పటికీ సన్నరకాలను సాగు చేసేందుకే చూస్తున్నారు. ప్రభుత్వం త్వరలో ఏఏ రకాలు సాగు చేయాల్లో ప్రకటిస్తే సాగువైపు రైతులు మొగ్గు చూపుతారని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు.

**తక్కువ దిగుబడి ...**

దొడ్డు రకాల కంటే సన్నని రకాలు సాగు చేయడం ద్వారా రైతులు నష్టపోయే అవకాశం ఉంది. సన్న రకాల సాగు ద్వారా ఎకరాకు 3 నుండి 5 క్వింటాళ్ల వరకు దిగుబడి తగ్గడమే కాకుండా పెట్టుబడి కూడా పెరుగుతుంది. ఇదిలా ఉండగా ప్రభుత్వం సన్నని రకాలు సాగు చేస్తే క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తే ఎకరాకు రూ.10 నుండి 15 వేల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వ ప్రకటన ఆశాజనకంగా ఉన్నప్పటికీ ఏఏ రకాలు సాగుచేయాలో పాలుపోక అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు.





# పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి




**ఎస్‌జిపిఏటి డిమాండ్**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** అపరిష్కృతంగా ఉన్న పెన్షనర్ల సమస్యలను సత్వరం పరిష్కరించాలని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ (ఎస్‌జిపిఏటి) రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఎస్‌జిపిఏటి ఖమ్మం జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం నగరంలోని రోటరీ నగర్ ఉన్నత పాఠశాలలో జరిగింది. జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు చెల్లించాల్సి ఉన్న నాలుగు విడతల డిఏను తక్షణమే చెల్లించాలని పెన్షనర్లకు నగదు రహిత, వైద్యం అమలుకు సత్వర చర్యలు తీసుకోవాలని పెన్షనర్ల కమ్యూటేషన్ రికవరిని 15 సంవత్సరాల నుంచి 12 సంవత్సరాలకు కుదించాలని సమావేశం కోరుతూ తీర్మానించింది. జూలై 2023 నుండి పిఆర్‌సి అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని ఐఆర్‌ను 20 శాతానికి పెంచి వర్తింపజేయాలని 398 వేతనంతో నియమించబడ్డ ఉపాధ్యాయులకు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్లకు గ్రాట్యూటి, కమ్యూటేషన్ తదితర బకాయిలను సత్వరం చెల్లించాలని ప్రభుత్వం ఈ విషయంలో తక్షణం నిర్ణయం తీసుకోవాలని సమావేశం డిమాండ్ చేసింది. పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం జేఏసి పిలుపు మేరకు జూలై 15 జిల్లా కలెక్టరేట్ ఎదుట జరిగే ఆందోళనను జయప్రదం చేయాలని సమావేశం పెన్షనర్లకు పిలుపునిచ్చింది. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి కన్నెకంటి కృష్ణమూర్తి, పెదమళ్ల సత్యనారాయణ, కొలికొండ శరత్‌బాబు, ఎండి అబ్దుల్ జబ్బార్, వి. లక్ష్మి, గుబ్బల వెంకటేశ్వరరావు, గుర్రాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# రైతు భరోసా పథకంపై అభిప్రాయాల సేకరణ

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని కల్లూరు చిన్న కోరుకొండి ప్రాథమిక సహకార సంఘంలో రైతు భరోసా అమలుపై రైతులతో అభిప్రాయ సేకరణ సలహాలు, సూచనలు ప్రత్యేక మహాసభలు ఆదివారం జరిగాయి. కల్లూరు లోని సొసైటీ అధ్యక్షులుబోబోలు లక్షణ రావు అధ్యక్షతన ముఖ్యఅతిథిగా అసిస్టెంట్ రిజిస్ట్రార్ నీరజ చిన్న కోరుకొండి సొసైటీలో చావా వెంకటేశ్వరరావు అధ్యక్షతన డిప్యూటీ రిజిస్ట్రర్ వాల్యా నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని రైతుల సలహాలు, సూచనలు అభిప్రాయాలను సేకరించారు. ఈ ప్రత్యేక మహాజన సభలో రైతులు మాట్లాడుతూ ఐదు ఎకరాల లోపు రైతులకు రైతు భరోసా పథకం వర్తింపు చేయాలని, మరికొందరు సాగు చేస్తున్న రైతులకు మాత్రమే రైతు భరోసా అమలు చేయాలని, కొంతమంది రైతులు కౌ లు రైతులకు రైతు భరోసా అమలు చేయాలని ,మరికొందరు రైతులు 10 ఎకరాల లోపు ఉన్నవారికి రైతు భరోసా అమలు చేయాలని రైతుల అభిప్రాయ



లను తెలిపారు. ఈ కార్యక్రమాలలో జిల్లా కోఆపరేటివ్ అధికారులు సందీప్, మౌలానా, రవి, కళ్యాణి శ్రీదేవి శంకర్ మండల వ్యవసాయ అధికారిని రూప, సీఈఓ లు వేలాద్రి, బీరవల్లి శ్రీనివాసరావు పాలక వర్గం రైతులు పాల్గొనగా అభిప్రాయాలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించినట్లు ఏవో తెలిపారు.

# రైతు భరోసాతోపాటు నగదురహిత వైద్యం అందించాలి

**ప్రజాపక్షం/కారేపల్లి:** ఐదెకరాలలోపు భూమి ఉన్న రైతు కుటుంబానికి రైతుభరోసాతో పాటు నగదురహిత వైద్యం అందించాలి. రైతు కుటుంబంలో కుటుంబ సభ్యులందరికి కలిపి ఎన్ని ఎకరాలు భూమి ఉన్నా ఐదు ఎకరాల భూమికి మాత్రమే రైతు భరోసా అందించాలి. అలాగే ఒక రైతు కుటుంబంలో కుటుంబ సభ్యులందరికి కలిపి మొత్తం ఐదెకరాల లోపు భూమి ఉంటే ఆ కుటుంబానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగస్థులకు ఇచ్చిన విధంగానే నగదు రహిత వైద్యం అందించాలి. ఈ పథకంలో రైతు కూలీలను కూడా చేర్చి వ్యవసాయ కూలీల కుటుంబానికి కూడానగదురహిత వైద్యం అందించలి. ఇందుకు గాను రైతు కుటుంబం వద్ద సంవత్సరానికి కనీస రుసుంగా ఎంతోకొంత సభ్యత్వ రుసుము వసూలు చేసిన పర్వాలేదు. కాని వారికి చిన్న జ్వరం వచ్చిన నగదు రహిత వైద్యం అందించే విధంగా ప్రణాళిక రూపొందించాలి. ఈ ఒక్క పథకంతోనే రైతులు సగంఅప్పులపాలు కాకుండా కాపాడవచ్చు. అదేవిధంగా 60 సంవత్సరాలు దాటిన చిన్న సన్నకారు రైతులకు, కూలీలకు నెలకు రూ.5వేలు పెన్షన్ అందించాలి. రాష్ట్రంలోని ప్రతి మండల కేంద్రంలో అన్నదాత కాంప్లెక్స్ నిర్మించాలి. ఈ కాంప్లెక్స్‌లో మండలంలోని ఆయా గ్రామాల ఐతులు తాము పండించిన పంటలను అమ్ముకునేందుకు వసతులు ఏర్పాటు చేయాలి. అదేవిధంగా రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో ప్రతి సంవత్సరం ముగ్గురు రైతులను ఎంపిక చేసి రైతురత్న అవార్డు అందించాలి. ఇందుకోసం ప్రభుత్వ ఆధ్వర్యంలో సంవత్సరంలో ఒక రోజు రైతు దినోత్సవం నిర్వహించాలి. రైతు దినోత్సవంతో పాటు ఒక వారం రైతు వారోత్సవాల పేరుతో మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి. రైతు లేకపోతే దేశం లేదు అనే సందేశం ప్రజల్లోకి వెళ్లేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. అంతేకాకుండా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సిఎస్ఆర్) పథకం క్రిందకు రాష్ట్రంలోని అన్ని విభాగాల కంపెనీలను చేర్చి ఆ నిధులతో రాష్ట్రంలో సాగునీటి వసతులు పెంపొందించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలి. అప్పుడే ప్రభుత్వాలు రైతు ప్రభుత్వాలుగా గుర్తింపు పొందడమే గాక రైతులు వైద్యపరంగా గాని ఇతరత్రా గాని అప్పుల పాలవకుండా అభివృద్ధి చెంది వ్యవసాయ రంగంలో రాష్ట్రం ముందంజలో ఉంటుందని ఎలాంటి సందేహం లేదు. ఇంకా చెప్పాలంటే ఇలా రైతు సంక్షేమం కోసం ప్రభుత్వాలు పనిచేస్తే రైతులకు అసలు కోట్లాది రూపాయల రుణమాఫీ చేయాల్సిన అవసరమే రాదు.

# ఎస్‌జిటి ఖాళీలన్నీ బదిలీలకు చూపించాలి

**ప్రజాపక్షం/కారేపల్లి:** ఎస్‌జిటి ఖాళీలన్ని బదిలీలకు చూపించాలని, ఆప్షన్స్ గడువు పొడిగించాలని, సీనియారిటీ జాబితాల్లో తప్పులు సవరించాలని టిఎస్‌యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి మంగీలాల్ అన్నారు. ఎస్‌జిటి తత్సమాన కేటగిరి ఉపాధ్యాయుల బదిలీలకు వేలాది పోస్టులను బ్లాక్ చేసి అప్రకటిత రేషనలైజేషన్ చేయడాన్ని టిఎస్‌యుటిఎఫ్ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. రేషనలైజేషన్‌పై విధానపరమైన నిర్ణయం తీసుకోకుండా విద్యార్థుల సంఖ్య ననుసరించి అదనపు పోస్టులను బ్లాక్‌చేసిన విద్యాశాఖ అవసరమైన పాఠశాలలకు అదనపు పోస్టులను మాత్రం కేటాయించడం లేదు. బదిలీలు, పదోన్నతులు షెడ్యూల్‌లో లేని హేతుబద్ధీకరణను మధ్యలో జొప్పించి కేవలం ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలల్లో మాత్రమే అమలు చేయడం గందరగోళానికి గురిచేస్తుందన్నారు. కోర్టు కేసులను బూచిగా చూపి వేల సంఖ్యలో ఉండే ఎస్‌జిటిలకు ఆప్షన్ గడువును ఒక్కరోజే ఇచ్చి హడావుడిగా ముగించాలని చూడటం సమంజసం కాదన్నారు. ఖాళీలను పూర్తి స్థాయిలో చూపించకుండా జరిపే బదిలీలు ఎవరి ప్రయోజనం కోసమని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారని అన్నారు. 9 ఏళ్లుగా పదోన్నతులు, ఆరేళ్లుగా బదిలీలు లేక విద్యారంగంలో సంక్షోభం నెలకొన్న నేపథ్యంలో పోరాడి సాధించుకున్న షెడ్యూల్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించాలనే ఉద్దేశ్యంతో చిన్న చిన్న పొరపాట్లు జరిగినా సర్దుకు పోతున్నామని, కాని సాఫ్ట్‌వేర్ లోపాలు, సర్వర్ సమస్యలు కుతోడు అప్రకటిత రేషనలైజేషన్ బదిలీల ప్రక్రియను అపహాస్యం చేస్తుందన్నారు. లక్షల మంది విద్యార్థులకు వందలాది కళాశాలలు, పదుల సంఖ్యలో కోర్సులతో ఇంజనీరింగ్, మెడిసిన్ కౌన్సిలింగ్‌లు ఆన్‌లైన్‌లో సమర్థవంతంగా నిర్వహించగలుగుతున్నప్పుడు కేవలం కొన్ని వేల మంది ఉపాధ్యాయులకు వెబ్ కౌన్సిలింగ్ సక్రమంగా నిర్వహించలేకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నామని అన్నారు. అవసరమైతే ప్రక్రియను రెండు రోజులు వాయిదా వేసి సమస్యలన్ని సానుకూలంగా పరిష్కరించి పొరపాట్లను సవరించి పారదర్శకంగా వెబ్ కౌన్సిలింగ్ నిర్వహించాలని టిఎస్‌యుటిఎఫ్ మండల కమిటీ డిమాండ్ చేస్తుంది.

## తాగునీటి కల్తీని పట్టించుకోరేమి..?

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు లోని ఆర్డిఓ కార్యాలయం ఎదురుగా మిషన్ భగీరథ తాగునీటి కల్తీని మిషన్ భగీరథ అధికారులు పట్టించుకోనందున నీరు రంగు మారి దుర్వాసన వస్తుంది. అవే నీరు చాంబర్ లో నుంచి కల్తీ అవుతుంది. అధికారులు పట్టించుకుని చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ నీరు వేంసూరు, సత్తుపల్లి, పెనుబల్లి వెళ్తున్న ప్రధాన పైప్లైన్ ఇక్కడే కల్తీ అవుతుండటంతో ఇంకను ముందు ముందు ఇంకా ఎలా కల్తీ అవుతున్నాయో అని ప్రజలు చర్చించుకుంటున్నారు. మరమ్మత్తులు చేసి మంచినీటిని సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.



## చెన్నూరులో ప్రపంచ కప్ విజయోత్సవ ర్యాలీ




**ప్రజాపక్షం/కల్లూరు:** భారత జట్టు టి20 వరల్డ్ కప్ విజేతలుగా నిలిచిన సందర్భంగా కల్లూరు మండ లం చెన్నూరు గ్రామంలోని క్రికెట్ అభిమానులు, ఆటగాళ్లు ఆనంద ఉత్సాహాలతో ర్యాలీ నిర్వహించి సం బరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంపకం, బా ణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని ప్రపంచ కప్పులు గెలవాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో చెన్నూరు ఉపాధ్యాయులు దంతాల సుధాకర్, గ్రామ క్రికెట్ అభిమానులు మం డల పరిధిలోని పలు గ్రామాలలో విజయోత్సవ ర్యాలీలు సభలు సమావేశాలు నిర్వహించారు.

## లారీ ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని ఆదుకోండి

**ప్రజాపక్షం/కారేపల్లి:** మన ఊరు వాడు, మనలో ఒకడు, అమ్మానాన్న లేరు పట్టుమని ఇంకా నిండా 20 ఏళ్ల కూడా నిండలేదు. కారేపల్లికిచెందిన రామగిరి సంపత్ అనే యువకుడు లారీ ప్రమాదంలో గాయపడి బ్రెయిన్‌కు దెబ్బతగిలి గత నాలుగు రోజులుగా ఖమ్మం హాస్పిటల్‌లో ఉన్నాడు. బ్రెయిన్‌కు ఆపరేషన్ చేయాల్సి ఉంది. రోజువారి మందులకు కూడా డబ్బులు లేని దైన్యస్థితి. కడు పేదరికంలో ఉన్న ఇలాంటి వాడికి నేనున్నానంటూ ప్రతిఒక్కరూ తమకు తోచినంత సహాయం ఏసి ఆదుకోండి. సాయం ఎంత అన్నది కాదు సాయం చేసిన వారిలో మనం ఉన్నామా లేదా మనం అనేదే ముఖ్యం. కాబట్టి సింగరేణి మండల ప్రజలు స్పందించి ఎంతోకంత ఆ యువకుడికి సహాయం చేయాలని సింగరేణిప్రజలుకోరుతున్నారు. సహాయం చేయదలచిన వారు 9705421475 ఫోన్‌పే చేయగలరని కోరుతున్నారు.

## ఢిల్లీ సెంట్రల్ యూనివర్శిటిలో గిరిజన విద్యార్థికి సీటు

**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఖమ్మం రూరల్ మండలం పెద్ద తండాకు చెందిన బానోత్ వీరన్న,జ్యోతి కుమారుడు బానోత్ అమిత్‌రాథోడ్ ఢిల్లీ సెంట్రల్ యూనివర్శిటీలో సీటు సాధించాడు. హైదరాబాద్‌లోని నారాయణకాలేజీలో ఇంటిగ్రేటెడ్ సివిల్స్ అకాడమిలో డిగ్రీ పూర్తి చేసి, నేషనల్ పీజీ (సి.యు.ఇ.టి)సెంట్రల్ యునివర్సిటీ ఎంట్రన్స్‌లో పరీక్ష రాశాడు. ఇందులో ఎస్‌టీ క్యాటగిరిలో ఆల్‌ఇండియా 35వ ర్యాంకు సాధించి ఈ ఘనతను పొందాడు. ఆ యువకుడిని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు, శ్రేయోభిలాషులతో పాటు పలువురు అభినందించారు.



## తెలంగాణ స్పోర్ట్స్ ప్రవేశానికై ఆహ్వానం

**ప్రజాపక్షం/కారేపల్లి:** ఖమ్మం జిల్లాలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో నాల్గో తరగతి చదువుతున్న ఆసక్తి గల విద్యార్థులకు రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశం పొందటానికి జిల్లాస్థాయి సెలక్షన్స్ జులై2న ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఉదయం 9గంటలకు నిర్వహించబడునని సింగరేణి మండల విద్యాశాఖ అధికారి దుగ్గిరాల జయరాజు పేర్కొన్నారు. జిల్లా నుంచి 20 మంది బాలురు, 20 మంది బాలికలు రాష్ట్రస్థాయి సెలక్షన్స్‌కు ఎంపిక చేయబడతారని, కావున పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈ సమాచారాన్ని తమ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు తెలియజేయాలని, ఖమ్మంలో జరిగే జిల్లాస్థాయి సెలక్షన్స్‌కు హాజరయ్యే ఆసక్తి గల విద్యార్థులు తమ ఆధార్‌కార్డు, పుట్టిన తేది సర్టిఫికెట్ లేదా బోనఫైడ్ సర్టిఫికెట్, కుల, ధృవీకరణ పత్రం, మూడో తరగతి ప్రోగ్రెస్ కార్డుతో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలు, ఒక పాస్‌పోర్ట్ ఫొటో తీసుకొని రావలెనని అన్నారు. కావున మండల విద్యాశాఖ అధికారులు తగు సమాచారం తమ పరిధిలోని పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు ఆసక్తికర విద్యార్థులను ప్రోత్సహించి జిల్లాస్థాయి ఎంపికకు హాజరగునట్లు చూడాలని అన్నారు. జూన్ 28, 29 తేదీల్లో సెలక్షన్స్‌లో పాల్గొని ఎంపిక కాలేకపోయిన వారు కూడా ఈ సెలక్షన్స్‌కు హాజరుకావచ్చని అన్నారు.

## పాకాలపాటిని పరామర్శించిన నారాయణ



**ప్రజాపక్షం/ ఖమ్మం :** సిపిఐ సీనియర్ నాయకులు పాకాల పాటి వెంకటేశ్వరరావు (పెద్ద బ్బాయి) లలిత రాజేశ్వరి దంప తులను సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఆదివారం పరామ ర్శించారు. ఖమ్మంలో వారి నివా సానికి వెళ్లి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల పాకాలపాటి దంపతులు అనారో గ్యానికి గురి కాగా ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని నారాయణ అడిగి తెలుసుకున్నారు. పాకాల పాటి పెద్దబ్బాయి బూర్గంపాడు సమితి అధ్యక్షులుగా, జెడ్పిటిసిగా, రాష్ట్ర రైతు సంఘం నాయకులుగా పని చేశారు. లలిత రాజేశ్వరి సైతం జెడ్పిటిసిగా ఎన్నికయ్యారు. పరామర్శిం చిన వారిలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాగం హేమంతరావు ఉన్నారు.

## రైతుల అభిప్రాయాలు ప్రభుత్వానికి నివేదిస్తాం




**ప్రజాపక్షం/ చింతకాని :** రైతు భరోసా అమలుపై ప్రభుత్వం ఆదేశాల మేరకు సేకరించిన రైతులు, గ్రామ పెద్దల అభి ప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తా మని జిల్లా వ్యవసాయ అధికారిణి విజ యనిర్మల పేర్కొన్నారు. రైతు భరోసాపై అభిప్రాయ సేకరణలో భాగంగా చింతకాని మండలం చింతకాని, నాగులవంచ సహకార సంఘాల వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆమె మాట్లాడుతూ రైతు భరోసా పథకంతో పాటు రైతు రుణమాఫీ అర్హులందరికీ వర్తించేలా చూడాలని కర్షకులు తెలిపారు. ఈసమావేశంలో మధిర ఎడిఎ వెంకటేశ్వర్లు, ఎఓ నాగయ్య, సహకార శాఖ అధికారులు ఉషారాణి, ఇందుమతి, జగదీష్, ఎంపిపి పూర్ణయ్య, సహకార సంఘం అధ్యక్షులు కొండ పల్లి శేఖర్‌రెడ్డి, నల్లమోతు శేషగిరిరావు, పాలకవర్గ సభ్యులు, సిఇఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

## గోపాల్ క్రమశిక్షణ కలిగిన కార్యకర్త



**ప్రజాపక్షం/ చింతకాని :** సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పగిడిపల్లి ఏసు తండ్రి పగిడి పల్లి గోపాల్ దిశదిన కర్మ ఆదివారం మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామంలో నిర్వ హించారు. ఈ సందర్భంగా గోపాల్ చిత్రపటా నికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో పగిడిపల్లి గోపాల్ తాను మృతి చెందే వరకు క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా ఉన్నారని అన్నారు. నివాళులర్పిం చిన వారిలో సిపిఐ జిల్లా నాయకులు వేపూరి రవీంద్రబాబు, దొండపాటి రమేష్, తాటి వెంక టేశ్వర్లు, మండల కార్యదర్శి పావులూరి మల్లికార్జున్‌రావు, జిల్లా నాయకులు తోట రామాం జనేయులు, ఆదినారాయణ, అబ్బూరి మహేష్, మండల నాయకులు పాల్గొన్నారు.

## ఏఐటియుసి జిల్లా కౌన్సిల్ మెంబర్‌గా లఘుపతి



**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి:** ఇటీవల జరిగిన భద్రాద్రి కొత్తగూడెం ఏఐటి యుసి 2వ జిల్లా మహాసభలో జిల్లా కౌన్సిల్ మెంబర్‌గా బానోతు లఘు పతి ఎన్నికయ్యారు. కొత్తగూడెం పట్టణం ప్రాంతానికి చెందిన లఘుప తికి జిల్లా కౌన్సిల్ ఎన్నికకావడం పట్ల పార్టీ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి ఏఐటియుసి జిల్లా కౌన్సిల్ మెంబర్‌గా బాధ్యతలు అప్పగించిన పార్టీ జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్‌పాషా అగ్రనాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్య త్తులో కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఉద్యమాలు నిర్వహిస్తానని అన్నారు.

## సింగరేణి ఏరియా హాస్పిటల్ సందర్శన



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు ఏరియా హాస్పిటల్ లో దీర్ఘకాలికంగా కొన్ని సమస్యలు నెలకొని ఉన్నాయనీ వీటి పరిష్కారానికి సింగరేణి యాజమాన్యం చర్యలు చేపట్టాలని సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ మణుగూరు ఏరియా ప్రాతినిధ్య సంఘం (ఐ ఎన్ టి యు సి) నాయకులు వత్సవాయి కృష్ణంరాజు, సిల్వేరు గట్టయ్య యాదవ్ లు సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఏరియా హాస్పిటల్ కు సంబంధించి కార్మికుల నుండి వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో శనివారం సాయంత్రం ఐ ఎన్ టి యు సి బ్రాంచి కమిటీ, పిట్ కమిటీ సభ్యులతో కలిసి హాస్పిటల్ క్యాజువాలిటీ ఫిమేల్ వార్డులను సందర్శించారు. రోగుల యోగక్షేమాలను సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఏరియా యాజమాన్యం స్పందించి సమస్యల పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని కోరారు. వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది దీనికై వెంటనే దోమల నివారణకు కాలనీలో ఫాగింగ్ నిర్వహించాలని, పిచ్చి మొక్కలు కటింగ్ చేయాలని, కార్మికులు వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మొహమ్మద్ షాభుద్దీన్, సంతోష్ చరణ్, రాము, రామకృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# నిధులు రాక.. పనులు సాగక..!



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులోని పర్యవేక్షక ఇంజనీరు నీటిపారుదల శాఖ కార్యాలయం కల్లూరులో గత సంవత్సరం ఏప్రిల్ లో తన్నీరు హరీష్ రావు, పువ్వాడ అజయ్ కుమార్ లు సుమారు రెండు కోట్లు నిధులతో శంకుస్థాపన చేశారు. కల్లూరు, తల్లాడ, పెనుబల్లి , సత్తుపల్లి, వేంసూరు ,చింతకాని, ముదిగొండ ,బోనకల్ ,మధిర , ఎర్రుపాలెం పది మండలాలకు ప్రజల సౌకర్యార్థం ఈ కార్యాలయం ఆనాడు మంత్రులు శంకుస్థాపన చేశారు. దానికి నిధులు రాక పనులు సాగక పునాదుల్లోనే ఇనుప చువ్వలు తుప్పుబట్టి పాడవుతున్నవి. నిధులు రాక పనులు ముందుకు సాగడం లేదు. ప్రస్తుతం సిబ్బంది రేకులు ఇరుకుగదుల్లో కూలే దశలో ఉన్న రేకుల షెడ్డులు లో బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వ హిస్తున్నారు. ఆ రేకులు ఎప్పుడు కులుతాయో కూలి మీద పడతాయో అనుకుంటూ విధులు నిర్వహిస్తున్నారు. పాత భవనాల్లోనే విధులు నిర్వ హిస్తుండవ వల్ల సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటూ ఉన్నారు. చాలీచా లని గదులు, ఇరుకు గదులు, సౌకర్యాలు లేకపోయినా కూడా ఇబ్బం దులు పడుతూ విధులు నిర్వహిస్తూ ఉన్నారు. హడావుడిగా పునాదులు ప్రారంభించి నిధులు రావడంలేదని గుత్తి గారు మొదట్లోని వదిలేసి వెళ్లారు. దీంతో పునాదుల్లో ఇనుప చువ్వలు తుప్పు పట్టి పాడైపోతు న్నవి. హడావుడిగా శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభించారు. నిధులు రాకపోవడంతో పనులు సాగుతూ మొదట్లోనే భవన నిర్మాణం నిలుపుదల కావడంతో ఒకవైపు సిబ్బంది ఇబ్బందులు మరోవైపు విధులు నిర్వహణ, పది మండలాలకు ఉపయోగపడే ఈ కార్యాలయం నిధులు విడుదల రికార్డులు భద్రపరచడం ఈ కార్యాలయంకు 10 మండలాలకు సంబంధించిన రైతులు అధికారులు ప్రజాప్రతినిధులు కు ఉపయోగపడే ఈ కార్యాలయం నిలుపుదల కావడంతో ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే స్థానిక మంత్రులు దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేసి త్వరితగతిన కార్యాలయం భవన నిర్మాణాన్ని పూర్తిచేయాలని 10 మండలాల ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# ఎడతెరిపి లేని వర్షంతో రైతుల్లో ఆనందం



**ప్రజాపక్షం/కల్లూరు:** గత రెండు రోజుల నుంచి కురుస్తున్న ఏడో తారీ ఖున వర్షంతో రైతుల్లో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కల్లూరు మండల పరిధిలోని శనివారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షంతో రైతుల్లో హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత పది రోజుల నుంచి మండలంలో వారి పత్తి, వరి, మిర్చి నారుచ జీలుగులు చల్లే పద్ధతిలో ఉండగా వర్షం కోసం ఎదు రుచూస్తున్న రైతులు శనివారం నుంచి ఎడతెరిపిలేని వర్షంతో రైతుల్లో ఆనంద వ్యక్తం చేస్తున్నారు. కల్లూరు మండల పరిధిలోని లక్ష్మీపురం , కల్లూరు, చెన్నూరు, బత్తులపల్లి, ముచ్చరం, చిన్న కోరుకొండి, పెద్ద కోరుకొండి, లింగాల, పాయ్‌పూరు, పుల్లయ్య బంజర, ఎర్ర బోయిన పల్లి తదితర గ్రామాలలో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వరి విత్త నాలు కరివేద జల్లే పద్ధతిలో 8000 ఎకరాలు, పత్తి 2000 ఎకరాలు లో విత్తనాలు నాటి కరివేద వరి విత్తనాలు పద్ధతిలో జల్లి గత పది రోజులు క్రితం సిద్ధం చేయగా అవి ఇప్పుడు మొలకెత్తి ఆ పంటలకు ఈ వర్షం అనుకూలంగా ఉంది. అదే విధంగా జిలుగులు సారవంతమైన పంట లకు బలాన్ని ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయి. చెరువులు, కుంటలకు నీరు రాకపోయినా కరివేద పద్ధతిలో వరి విత్తనాలు చల్లిన వాటికి వర్షం ప్రాణం పోసింది.

# అర్హులైన వారికే రైతు భరోసా వర్తింపజేయాలి




**ప్రజాపక్షం/గుండాల :** రైతుబరోసా పథకం ఎలాంటి ఆంక్షలు లేకుండా సాగుచేసే ప్రతి రైతుకు ఈ పథకం వర్తింప చేయాలని ,పంటలు సాగు చేయని రైతులకు ఈ పథకం వర్తించకుండా చేయాలని రైతులు, ప్రజాప్రతినిదులు డిమాండ్ చేశారు. ఆదివారం పిఎసిఎస్ అధ్యక్షులు గొగ్గెల రామయ్య అధ్యక్షతన మండల కేంద్రంలోని రైతు వేదిక నందు మహాజనసభ నిర్వహించారు. ముందుగా జిల్లా వ్యవ సాయ శాఖ అధికారి బాబురావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ పథకంపై రైతులనుండి సలహాలు, సూచనలు తీసుకునేం దుకు సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 5 ఎకరా లకు,10ఎకరాలకు కావాలా..పాతపద్ధతిన పథకం వర్తింపచేయాలా అని రైతులను అభిప్రాయాలను తీసుకున్నారు. ఎకరాలతో పనిలేకుండా రైతు ఎంత సాగు చేస్తున్నాడో పరిశీలన చేసి ప్రతి ఎకరాకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామి మేరకు ఎకరాకు 15 వేలు చెల్లించాలని ఆళ్ళ పల్లి, గుండాల ఎంపిపిలు కోంద్రు మంజుభార్గవి, ముక్తి సత్యం తో పాటు పలువురు రైతులు తమ అభిప్రాయాలను తెలిపారు. భూస్వా ములు, పెట్టుబడిదారులకు ఎక్కువ మొత్తంలో ఎకరాలు ఉండి, వ్యవ సాయం చేయని వారికి ఈ పథకం వర్తింప చేయరాదని అన్నారు. సాగు రైతు తో పాటు , కౌలురైతుకు కూడ పెట్టుబడి సాయం చెయ్యాలని డిమాండ్ చేశారు. రైతుల అభిప్రాయాలను తీర్మాణం చేసి జిల్లా అధికా రులకు , ప్రభుత్వానికి నివేధికలు పంపిస్తామని జిల్లా వ్యవసాయాది కారి బాబురావు తెలిపారు. రైతులకు కావాల్సిన ఎరువులు పూర్తిస్థా యిలో అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఒలు చల్లూరి వెంకటరమణ, రామారావు, సిఇఒ రాంబాబు, మోకాళ్ళ వీర స్వామి రైతులు పాల్గొన్నారు.

# పుస్తకాల పేరుతో దోచుకుంటున్నారు..

**ప్రజాపక్షం/మణుగూరు:** పుస్తకాల పేరుతో ప్రైవేటు విద్యాసంస్థలు అధిక డబ్బులు, స్కూల్ ఫీజులు వసూలు చేస్తున్నారని, దీనిని వెంటనే విద్యాశాఖ అధికారులు నియంత్రణ చేయాలని లేకుంటే ఆందోళన తప్ప దని సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్ హెచ్చరిం చారు. మణుగూరు డివిజన్లో విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే ప్రైవేట్ విద్యాసంస్థలు పాఠ్యపుస్తకాలను కూడా అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారని , కొన్ని స్కూల్లోనే పుస్తకాలు అమ్ముతున్నారని, ప్రైవేట్ స్కూల్స్, మార్కెట్లలో బుక్ స్టాల్స్ ద్వారా అమ్మకాలు కొనసా గిస్తూ వేలాది రూపాయలు వసూలు చేస్తూ ముక్కు పిండుతున్నారని వారు ఆరోపించారు. ఒకవైపు ప్రైవేట్ స్కూళ్లలో అధిక ఫీజులు కట్టలేక సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే దీనికి తోడు పుస్తకాల పేరుతో ఎల్ . కే జి.పుస్తకాలు 3000 రూపాయలు, మూడో తరగతి పుస్తకాలు 5,000 రూపాయలు ఇలా అధిక డబ్బులు వసూలు చేస్తూ , సామాన్య, మధ్య తరగతి, పేద విద్యార్థులను ఇబ్బందుల గురి చేస్తుందని, రిక్షా కార్మికుడు, ఆటో నడుపుకునే వ్యక్తి, కూరగాయలు అమ్ముకునే వ్యక్తి , చేతివృత్తుల వారు ఇలా ఇబ్బందులు పడుతున్నా సంబంధిత విద్యాశాఖ మాత్రం ఏమాత్రం పట్టించుకోవడంలేదని, పత్రి కలలో వచ్చినా పట్టింపు లేదని, కేవలం మాకు ఫిర్యాదు వస్తేనే మేము విచారణ చేస్తామంటూ అధికారులు చేతులు దులుపుకుంటున్నారని వారు ఆరోపించారు. సంబంధిత శాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి పుస్తకాల అమ్మే షాపుల పైన చర్యలు తీసుకొని అధిక డబ్బులు తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రత్యక్ష ఆందోళన తప్పదని హెచ్చరించారు.

# చలనం లేని విద్యాశాఖ..?



**-మా పాఠశాల మా ఇష్టం అనే రీతిలో యాజమాన్యాలు**
**-అచేతన స్థితిలో విద్యాధికారులు**
**-జిల్లా కలెక్టర్ దృష్టి సారించాలని వేడుకోలు**

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు మండలంలో ఇష్టానుసా రంగా ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీ చేస్తున్న విద్యాశాఖలో మాత్రం చలనం రావడం లేదనే మాట మండలంలో వినిపిస్తోంది. ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలహీనపడటంలో ఆ శాఖ అధికారుల పాత్ర ఎంతైనా ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. విద్యాశాఖలో విధులను నిర్వహి స్తున్న ఉన్నతాధికారులు ప్రైవేట్ విద్యా సంస్థలు ప్రభుత్వ నియమాలకు అనుగుణంగా ఉన్నాయా లేవా అనే విషయాలను పరిశీలించడం లేదు. అసలు ఓ ప్రైవేట్ విద్యాసంస్థలో క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు, ప్రభుత్వ నియమాలకు అనుగుణంగా వసతులు, ఆట స్థలం, ఆర్‌వో వాటర్, వ్యాయామ ఉపాధ్యాయుడు, పరిశుభ్రమైన టాయిలెట్స్, గాలి వెలు తురు వచ్చే విధంగా తరగతి గదులు, 40 మంది కంటే ఎక్కువ మంది విద్యార్థులు ఓకే తరగతి గదిలో ఉండకూడదు, అదే విధంగా ఆ పాఠశా లలో ఫైర్ సేఫ్టీ ఉండాలి. కానీ ఆవిధంగా మండలంలోని పలు ప్రైవేట్ పాఠశాలు ప్రభుత్వ నిబంధనలు పాటించకపోయినా వారిపై చర్యలు తీసుకోకపోవడంతో ప్రైవేట్ విద్య సంస్థలతో మిలాఖత్ కావడంతో పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రిస్తామని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. కానీ దిశగా మాత్రం విద్యాశాధికారులు అడుగు వేస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. దీంతో విద్యను వ్యాపారంగా మార్చుకున్న కొన్ని ప్రైవేట్ విద్యా సంస్థలు అతిపెద్ద దోపిడీకి మండలంలో తెరలేపాయి. అనర్హులైన ఉపాధ్యాయులకే విద్య బోధన, పాఠశాలలో బుక్స్, అవ సరం లేని పుస్తకాలు ఏల్కేజీ నుండి మొదలై అన్ని తరగతుల వరకు అధిక ఫీజులు వసూళ్లు చేయడంతో పాటు ఇలా రకరకాలుగా అందిన కాడికి విద్యార్థులు తల్లిదండ్రుల జేబులకు చిల్లులు పెడుతున్నారు. ఇంతా జరుగుతున్న తమకేమీ సంబంధం లేదు అన్నట్లుగా మండల విద్యాశాఖాధికారి వ్యవహారిస్తున్న తీరు పలు అనుమానాలకు తావిస్తోం దని ప్రజలు బాహాటంగా చర్చించుకుంటున్నారు. నిరుపేద విద్యార్థు లను ప్రచార ఆర్భాటాలతో చేర్పించుకుని తరువాత వారిపై పిడుగులా ఫీజుల మోతను వేసి మానసికంగా కృంగదీస్తున్నారు. బూర్గంపాడు మండలంలోని పలు ప్రైవేట్ పాఠశాలలు మా పాఠశాల మా ఇష్టం అనే రీతిలో ఫీజులను అమాంతం పెంచి విద్యార్థుల తల్లిదండ్రులను ఇబ్బం దులకు గురి చేస్తున్నప్పటికీ అచేతనంగా విద్యాధికారులు ఉండి పోవడం కొస మెరుపు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ బూర్గంపాడు మండ లంలో ప్రైవేట్ విద్యా దోపిడీపై దృష్టి సారించి , పూర్తి స్థాయిలో విచా రణ చేసి ప్రభుత్వ నిబంధనలను పాటించని వారిపై కఠిన చర్యలు తీసు కోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# చేసిన సేవలు కలకాలం గుర్తుండిపోతాయి..



**- పదవీ విరమణ పొందడం తప్పనిసరి**
**- ఎస్‌పి రోహిత్ రాజ్**
**- ఐటిడిఏలో పలువురి పదవీ విరమణ**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఉద్యోగులు తమ విధి నిర్వహణలో ప్రజలకు చేసిన సేవలు కలకాలం గుర్తుండి పోతాయని ఎస్‌పి రోహిత్ రాజ్ అన్నారు. పోలీస్ శాఖలు విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన ఏఎస్ఐ గురునాధం, ఏఆర్ఎస్ఐ అబ్బయ్య లను ఎస్‌పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కత్తిమీద సాములాంటి పోలీస్ ఉద్యోగంలో ఎన్నో ఒడిదుడుకులు ఉంయాని వాటిని తట్టుకుంటూ ప్రజలకు సేవే చేసేందుకు ఇంతకాలం కృషి చేయడం అభినందనీయం అన్నారు. ప్రభుత్వ పరంగా రావాల్సిన అన్ని రకాల ప్రోత్సహకాలను, నగదు త్వరితగతిన అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వారితో పాటి వారి సతీ మణులకు పూల మాలలు అందజేసి షాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది నాగరాజు,కృష్ణారావు, శ్రీనివాసరావు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

**ఐటిడిఏలో...**




ఐటిడిఏలోని పలు విభాగాల్లో పనిచేసే సిబ్బంది పదవీ విరమణ పొందగా వారిని సత్కరించారు. ఐటిడిఏ ఇంజనీరింగ్ విభాగంలో బ్లూ ప్రింట్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన నాగభూషణం, ఐటిడిఏలోని టిసిఆర్ అండ్ టిఐ విభాగంలో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన సత్యవతి,దుమ్ముగూడెం మండలం మంగవాయిబాడువా ఆశ్రమ పాఠశాల్లో కమాటీగా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన కల్లూరి నీలమ్మలను ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉద్యోగులు వారి వారి విధుల పట్ల శ్రద్ధతో పనిచేసిన నాడు వారిని గుర్తుంచుకుంటారని, వారి లేరని బాధ కలుగుతుందని చెప్పారు. వయస్సు రిత్యా, ప్రభుత్వ నిబంధనల రిత్యా పదవీ విరమణ తప్పనిసరి అని. ఉద్యోగ విరమణ అనంతరం అందిన సొమ్ములను పాడు చేసుకోకుండా జాగ్రత్త చేసుకుంటూ శేషజీవితాన్ని హాయిగా గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిడి మణెమ్మ, ఏపిఓ దేవిడ్ రాజ్‌తో పాటు పలు శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యలను పరిష్కరించండి




**ప్రజాపక్షం/మణుగూరు:** సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియూసి) మణుగూరు బ్రాంచ్ నాయకత్వం ఆదివారం పికెఓసి2 ను సందర్శించి, కార్మికులను కలుసుకొని, వాస్తవ పరిస్థితులను పరిశీ లించినట్లు బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ ఎం.వి.రామన సయ్య తెలిపారు. ముఖ్యంగా రైల్వే అండర్ బ్రిడ్జి దగ్గర పరిస్థితిని పరిశీలించగా వర్షాకాలంలో కార్మి కులు ప్రమాదం బారిన పడే అవకాశాలు ఉన్నాయని అన్నారు. వరదను దృష్టిలో పెట్టుకొని తగిన రక్షణచ ర్యలు తీసుకోవాలని లేదా ప్రత్యామ్నాయ మార్గాన్ని ఆలోచించాలని కోరారు. పికెఓసి 2 లో అన్ని సెక్షన్లను సందర్శించి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవడం జరిగిందని అన్నారు. ముఖ్యంగా రోడ్లు మొత్తం బురదమయం అయిపోయి కార్మికులు నడవలేని పరిస్థితి ఉందని అన్నారు. 60టి డంపర్ పార్కింగ్ యార్డ్ కు రహదారి దయనీయంగా మారడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని అన్నారు. ఈ సమస్యలన్నింటినీ కార్మికులను అడిగి తెలుసుకున్న బ్రాంచ్ నాయకత్వం కంపెనీ కోసం అనుక్షణం కష్టించి పనిచేస్తున్న కార్మికుల కొరకు మేనేజ్మెంట్ వెంటనే యుద్ధ ప్రాతిపదికన సమస్యల పరిష్కారం కొరకు చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ యూని యన్ తరపున డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో బ్రాంచ్ అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ కామ్రేడ్ మేకల ఈశ్వర్, ఆఫీస్ బేరర్స్ ఆవుల నాగరాజు, ఆధార్ల సురేం దర్, శనిగరపు కుమారస్వామి, పిట్ సెక్రటరీ కోడి రెక్కల శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ పాపారావు పాల్గొన్నారు.

## ఓల్డ్ పెన్షన్ స్కీమ్ వర్తింపజేయాలి



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** తెలంగాణలోని ఉద్యోగ, ఉపాధ్యాయ లందరికీ ఓల్డ్ పెన్షన్ స్కీమ్ వర్తింపజేయాలని ఎస్‌జిటిలకు టీచర్ ఎంఎల్‌సి ఎలక్షన్స్‌లో ఓటు హక్కు ఇవ్వాలని వీటిని సాధించడం కోసం 108 రోజుల పాటు ఫలహార దీక్ష చేస్తు న్నట్లుగా మర్కోడ్ కాంప్లెక్స్ పరిధిలోని ఎంపీపీ ఎస్ జాకా రం పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మహమూద్ పాషా తెలిపారు. గతంలో 13 ఫిబ్రవరి 2024 నుంచి 4 మార్చి 2024 వరకు ఓల్డ్ పెన్షన్ స్కీం కోసం 21రోజుల పాటు ఒంటి పూట ఆహారం స్వీకరిస్తూ దీక్ష చేసినట్లుగా ఆయన గుర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన రాకపోవడం వల్ల ఈ సారి 108 రోజుల ఫలహార దీక్ష చేస్తున్నట్లుగా తెలిపారు. ఈఫలహార దీక్ష 1 జూలై 2024 నుంచి 16 అక్టోబర్ 2024 వరకు జరుగుతుందన్నారు. ఈ 108 రోజుల ఫలహార దీక్షలో మొదటి 25రోజులు ఒక పూట ఫలహఋరం, తర్వాత 25 రోజులు రెండు పూటల ఫలహారం, మిగిలిన 58రో జులు మూడు పూటలా కేవలం ఫలాలను మాత్రమే ఆహారంగా స్వీకరిస్తూ దీక్ష కొనసాగిస్తు న్నట్లుగా తెలిపారు. ఈ దీక్ష ద్వారా ప్రభుత్వంలో స్పందన వస్తుందని ఆశిస్తూ తద్వారా ఉద్యోగ ఉపాధ్యాయులకు మేలు జరగాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు.

## సీతారామ ప్రాజెక్ట్ సక్సెస్ పట్ల హర్షం



**ప్రజాపక్షం/ములకలపల్లి:** కేసీఆర్ వల్లనే సీతారామ ప్రాజెక్ట్ కల సాకారం జరిగిందని, సీతారామ ప్రాజెక్ట్ సక్సెస్ పట్ల జెడ్‌పిటిసి సున్నం నాగమణి హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం మండల పరి ధిలోని మాదారం గ్రామం తన నివాసంలో ఆమె మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అవిరాల కృషి, భగీరథ అద్భుత ప్రయత్నంలో సీతారామ ప్రాజెక్ట్ ట్రయల్ రన్ విజయవంతమూ, ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజల చిరకాల జల సంకల్పం నెరవేరిందని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ నీటితో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో లక్షలాది ఎకరాలు సస్యశ్యామలమై, అన్నదాతల కలలు సహకారం అవు తుందని ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ మొదటి దశ పంప్ హౌస్ ద్వారా గోదావరి జలాలు ఊరూరా పరుగులిడి లక్షలాది ఎకరాలకు చేరుతాయని తెలిపారు. సీతారామ ప్రాజెక్ట్ సక్సెస్ విజయంలో భాగస్వాములైన నీటిపారుదల శాఖ అధికారులు, సిబ్బందిని కూడా అభినందిస్తున్నట్లు తెలిపారు.

## కొట్టుకుపోయిన రంగిరెడ్డిపల్లి అప్రోచ్ బ్రిడ్జి



**ప్రజాపక్షం/ములకలపల్లి:** రంగిరెడ్డిపల్లి అప్రోచ్ బ్రిడ్జి కొట్టుకుపోయింది. 6 గ్రామల ప్రజలకు రహదారి ప్రాంతం అయిన ములకలపల్లి, రంగిరెడ్డిపల్లి గ్రామాల మధ్యలో అప్రోచ్ గల బ్రిడ్జి కొట్టుకుపోవడంతో ఆదివారం ములకలపల్లి తహసీల్దార్ వదర ఉధృతి తీరును పరిశీలించారు. ఈవిషయంలో ఏఈఈ(టిడబ్ల్యూ) తో ఫోన్‌లో వరద ఉధృతి తీరును గురించి మాట్లాడారు. వారు తాత్కాలిక వంతెన నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు.

## నాలుగు మండలాలకు ఒకే ఎంఈఓ



**ప్రజాపక్షం/కరకగూడెం:** అబ్బా.. అబ్బా.. చదువు చెప్పండి సారూ.. ఉపాధ్యాయులేరయ్యా.. అయ్యో... ఎలా సారూ... ఎలా ఏమిటి నేను చేయడం లేదా.... ఒక మండల ఎంఈవోగా.... నాలుగు మండలాల ఇన్చార్జ్ అలానే ఏక్ నిరంజన్‌లా అన్నరీతిలో మండలంలో పరిస్థితులు కనిపిస్తున్నాయి. అయితే విద్యార్థులు సైతం పూర్తి స్థాయిలోఉన్నప్పటికీ ఉపాధ్యాయులు మాత్రం ఒకే ఒక్కరుగా ఉండటం ఇప్పుడు మండలంలో తీవ్రచర్చకు దారి తీస్తుంది. ప్రభుత్వం అనంతరం దాదాపుగా సంవత్సరాలు గడుస్తున్న పాఠశాలను ప్రారంభించి అన్ని ఎన్నో సదుపాయాలుతో పాటు నియంత్రణ చర్యలు ఎప్పటికప్పుడు తీసుకుంటామని తెలిపారు. కానీ మండలం పూర్తి స్థాయిలో ఏజెన్సీ కావడంతో ఇక్కడ విద్యార్థులకు చదువు అందరనీ దాక్షలా మారింది. పాఠశాలలో ఉపాధ్యాయులు ఉండరు. ఒకవేళ ఉన్నా సమయానికి రారు. వచ్చినా బోధనలు కన్నా సెల్ ఫోన్ మిన్న అన్న చందంగా వారి తీరు ఉంటుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అంతే కాకుండా స్థానికంగాఉండక పోవడం ఇతర ప్రాంతాల నుండి రావడం, విద్యార్థులకు చదువుకు దూరం అవుతున్నారు చెప్పాల్సిన ఉపాధ్యాయులే నియమాలను పాటించకపోవడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ఇక పాఠశాల పరిస్థితులు, ఉపాధ్యాయుల తీరు ఇలా ఉండేవీటి అన్నిటిని పర్యవేక్షించాల్సిన మండల విద్యాశాఖ అధికారికి మొత్తం నాలుగు మండలాలు పినపాక, కరకగూడెం, మణుగూరు, అశ్వాపురం మండలాల ఇన్చార్జ్ గా బాధ్యతలనుచేస్తున్నారు. అయితే ఇక్కడ వరకు బాగానే ఉన్నప్పటికీ పర్యవేక్షణ లోపంతో ఉపాధ్యాయులు మండలంలో ఇష్టాను సారంగా వ్యవహారిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఏజెన్సీ ప్రాంత విద్యార్థులకు విద్య అందని దాక్షలా కాకుండా మెరుగైన విద్యాఅందే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఘనంగా స్తంభాద్రి ఆసుపత్రి ప్రారంభం



**పాల్గొన్న భట్టి, తుమ్మల, పువ్వాడ నాగేశ్వరరావు**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మంలో నెహ్రూ నగర్‌లో స్తంభాద్రి ప్రైవేటు ఆసుపత్రి ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, సిపిఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు లు ప్రారంభించారు. అత్యాధునీక వసతులతో ప్రారంభమైన ఈ ఆసుపత్రి ఖమ్మం జిల్లాతో పాటు పరిసర జిల్లాల ప్రజానీకానికి వైద్య సేవలను అందించనుంది. అత్యుత్తమ వైద్య సేవలు అందించనున్నట్లు యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ ఖమ్మం వైద్య సేవలను అందించడంలో హైదరాబాద్ తో పోటీ పడుతుందని అధునీక టెక్నాలజీతో ఆసుపత్రులను ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. నాణ్యతతో కూడిన వైద్యాన్ని పేదలకు అందుబాటులోకి తీసుకు రావడానికి ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. 130 పడకల సౌకర్యంతో 60వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో, విశాలమైన భవనంలో ఈ ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. క్యాథ్‌ల్యాబ్, సిటీ స్కాన్ సౌకర్యం ఉండటం గమనార్హం. ఆసుపత్రి వైద్యులు సురేష్, మేదరమెట్ల అనిల్‌కుమార్, గుమ్మడి రాఘవేంద్ర, హర్షతేజ, కృష్ణ, సుమంత్ లు ఈ ఆసుపత్రి ద్వారా ప్రజలకు అధునీక వైద్యం అందుబాటులోకి తీసుకు రావడంతో పాటు మెరుగైన వైద్య సేవలను అందించనున్నామన్నారు. ప్రారంభ కార్యక్రమంలో ఎంఎల్‌సి తాతా మధుసూదన్, సిపిఐ (ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సిపిఐ రాష్ట్ర నాయకులు బాగం హేమంతరావు, మాజీ ఎంఎల్‌సి లు పోట్ల నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మి నారాయణ, సిపిఎం నాయకులు పోతినేని సుదర్శన్, నున్నా నాగేశ్వరరావు, బిజెపి నాయకులు గల్లా సత్యనారాయణ, మాజీ ఎంఎల్‌ఎ రాములు నాయక్, డిఎంఅండ్‌హెచ్‌వో మాలతి, ఐఎంఎ అధ్యక్షులు కంభంపాటి నారాయణరావు, కార్యదర్శి జగదీష్, కోశాధికారి స్వప్న పాల్గొన్నారు.

## పట్టా భూముల్లో హద్దులు నిర్ణయించడం సరికాదు

**-దూకుడుగా వ్యవహరిస్తున్న రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోండి : సిపిఐ నేత కూనంనేని**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని పట్టా భూముల్లో రెవెన్యూ అధికారులు హద్దులు నిర్వహిస్తూ రాళ్లు పాతటం సరికాదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి , కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. అనేక దశాబ్దాలుగా ప్రజల ఆధీనంలో ఉండి పట్టా కలిగిన భూములను కొందరు రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిగా చూపి కొందరికి లబ్ది చేకూర్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన తెలిపారు. ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని పాత రాజన్నపేట గ్రామ కంఠం భూములను సిపిఐ నాయకులతో కలిసి పరిశీలించారు. బాధిత రైతులు తమకు పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్నప్పటికీ ప్రభుత్వ భూమిగా నిర్ధారించారని సాంబశివరావు ఎదుట వాపోయారు. భూములను పరిశీలించిన సాంబశివరావు స్థానిక ఆర్డీవోతో ఫోన్‌లో మాట్లాడారు. రాజన్న పేట రైతుల పేర అనేక దశాబ్దాలుగా భూమి హక్కులు ఉన్నాయని దానిని పరిశీలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్‌కె జానిమియా, రాజన్నపేట రైతులు పాల్గొన్నారు.

# అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన డిప్యూటీ సిఎం



**ప్రజాపక్షం/ మధిర :** మధిర మండలంలో సుమారు రూ.41.30కోట్లతో పలు అభివృద్ధి పనులకు డిప్యూటీ సిఎం, ఆర్థిక, విద్యుత్‌శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క శంకుస్థాపన చేశారు. ఆదివారం మండల పరిధిలోని వంగవీడు గ్రామంలో రూ.30కోట్లతో బోనకల్, ఆళ్ళపాడు, వంగవీడు లింకు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం చిలుకూరు గ్రామంలో శివాలయం వద్ద రూ.70లక్షలతో బిటి రోడ్డు పనులకు రూ.2.85కోట్లతో చిలుకూరు గ్రామం నుండి దొడ్డదేవర పాడు గ్రామం వరకు బిటి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం సిద్దినేనిగూడం గ్రామంలో రూ.2.75కోట్లతో సిద్దినేనిగూడెం నుండి పెనగొలను వరకు బిటి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అదే గ్రామంలో ముగ్గురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మాటూరు గ్రామం నుండి మధిరలోని ముస్లింకాలనీ వరకు రూ.5కోట్లతో నిర్మించనున్న బిటి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాన చేశారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, జాయింట్ కలెక్టర్ మధుసూదన్‌రావు, ఆర్‌డిఓ గణేష్, ఖమ్మం డిసిసిబి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, తహశీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపిడిఓ వెంకటేశ్వర్లు, మధిర సిఐ మధు, రూరల్ ఎస్సై లక్ష్మీ భార్గవి, ఎంపిపి మెండెం లలిత, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, మాజీ జెడ్పిటిసి సూరంశెట్టి నాగభూషణం, కోట వెంకటకృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన అంగన్వాడీల శిక్షణ తరగతులు



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** అంగన్వాడీ టీచర్లకు మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం ఆదివారం ముగిసింది. ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్వాడీ టీచర్లకు శిక్షణ కార్యక్రమం శుక్రవారం తాళ్లగొమ్మూరులో ప్రారంభించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సిడిపివో ప్రమీల పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు నుండి ఆరు సంవత్సరాల చిన్నారులకు బోధించే అంశాల గురించి ఆటపాటలతో విద్య మానసిక ఎదుగుదల సామర్థ్యం గురించి టీచర్లకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. తొలిరోజు శిక్షణకు 35 మంది అంగన్వాడీ టీచర్లు హాజరైన్నారు. ఈకార్యక్రమంలో సూపర్వైజర్లు సక్కుబాయి, రాజేశ్వరి, ఎన్జీవో సంస్థ ప్రతినిధులు, అంగన్వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** భారత ప్రధాని నరేంద్రమోదీ గత పది సంవత్సరాలుగా నిర్వహిస్తున్న మన్ కి బాత్ కార్యక్రమంలో భాగంగా నరేంద్రమోదీ మూడవసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా, 111వ మన్ కి బాత్ కార్యక్రమం ఆదివారం మండల పరిధిలోని రఘునాథపాలెం గ్రామంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తక్కెళ్ళపల్లి నరేందర్ ఇంట్లో టెలివిజన్ ద్వారా వీక్షించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మన్ కి బాత్ ద్వారా మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు అమ్మ పేరు తో ఒక చెట్టు నాటాలని ప్రతి ఒక్క పౌరుడు యోగ చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తక్కెళ్ళపల్లి నరేందర్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి నల్లగట్టు శ్రీనివాస్, దారమళ్ళ ఉపేందర్, మట్టపల్లి భద్రయ్య, జనక మునేష్, వార నాగరాజు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

**- డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క**



**ప్రజాపక్షం/ చింతకాని :** గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క పేర్కొన్నారు. ఆదివారం చింతకాని మండలం గాంధీనగర్‌లో రూ.1.75 కోట్లతో నిర్మించనున్న రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా భట్టివిక్రమార్క మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలు, పేదల అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు. వారంలో రెండు రోజుల పాటు మధిర నియోజకవర్గంలో పర్యటిస్తానని, మధిర నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతానన్నారు. త్వరలోనే చింతకాని మండలంలో ఇంటర్నేషనల్ మోడల్ స్కూల్‌కు శంకుస్థామన చేస్తామన్నారు. అభివృద్ధి పనుల్లో ఆలసత్వం వహిస్తే సహించేది లేదని అధికారులకు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్‌డిఓ గణేష్, తహశీల్దార్ రమేష్, ఎంపిడిఓ రామయ్య, ఎంపిఓ మల్లెల రవీంద్ర ప్రసాద్, ఎంపిపి పూర్ణయ్య, పందిళ్ళపల్లి ఎంపిటిసి ఓర్సు వీరభద్రం, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంబటి వెంకటేశ్వర్లు, నాయకులు భాస్కర్, కూరపాటి కిషోర్, కన్నెబోయిన గోపి, కూరపాటి రాము, బందెల నాగార్జున, మండల మహిళా అధ్యక్షురాలు ప్రగతి, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మతోన్మాదం ప్రమాదకరం




**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** మతోన్మాదం చాలా ప్రమాదకరమని ఖమ్మం జిల్లా సీపీఎం విద్యావిభాగం సబ్ కమిటీ సభ్యులు బోడపట్ల రవీందర్ అన్నారు. ఖమ్మం నగరంలోని మంచికంటి హాల్లో జరుగుతున్న ఖమ్మం రూరల్ మండల సీపీఎం శిక్షణ తరగతులు రెండరోజు మండల కార్యదర్శి నండ్ర ప్రసాద్ అధ్యక్షతన ఆదివారం జరిగాయి. మతోన్మాదం అనే అంశంపై మొదటిక్లాస్‌ను బోడపట్ల రవీందర్ బోధించారు. దేశంలో మతోన్మాదం పెరిగిపోయిందని ఇది చాలా ప్రమాదకరమన్నారు.

**పార్టీ నిర్మాణం-పద్ధతులు...**

అనే అంశంపై ఐద్వా రాష్ట్ర నాయకురాలు బుగ్గవీటి సరళక్లాస్ బోధించారు. కమ్యూనిస్టు కార్యకర్తలు నిత్య విద్యార్థుల్లా ఉండాలని, నిరంతరం అధ్యయనం చేయాలన్నారు. ప్రజావ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు అనేక రూపాల్లో ఎండగట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు బత్తినేని వెంకటేశ్వరరావు, సిద్ధినేని కోటయ్య, నాయకులు ఊరడీ సుదర్శన్‌రెడ్డి, పి. మోహన్‌రావు, పి. సంగయ్య, పెండాల్య సుమతీ, నందిగామ కృష్ణ, పొన్నం వెంకటరమణ, ఏటుకూరి ప్రసాదరావు, పల్లె శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

**భర్తే చంపాడని బంధువుల ఆరోపణ**




**ప్రజాపక్షం/ నేలకొండపల్లి :** వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా అదనపు కట్నం కోసం భర్తే కొట్టి చంపాడని మృతురాలి బంధువులు ఆరోపిస్తూ ఆందోళన చేసిన ఘటన ఆదివారం నేలకొండపల్లి లో జరిగింది. వివరాల్లోకి వెళితే... నేలకొండపల్లి మండలం సదాశివపురం గ్రామానికి చెందిన అవినాష్‌కు సూర్యాపేట జిల్లా మునగాల మండలంలోని తాడ్వాయికి చెందిన విజయతో ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరు పిల్లలు. అవినాష్ విజయను అదనపు కట్నం కోసం తరచూ వేధిస్తుండేవాడని రెండు రోజుల క్రితం కూడా తల్లిదండ్రులకు ఫోన్ చేసి భర్త వేధిస్తున్నాడని తెలియజేసిందని బంధువులు తెలిపారు. కొట్టి చంపి ఆసుపత్రికి తీసుకు వచ్చాడని న్యాయం చేయాలంటూ మృతురాలి బంధువులు పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. అవినాష్ పై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నేలకొండపల్లి ఆసుపత్రి వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.